ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

సోమవారం 24 మార్చి 2025



విస్తృతంగా... నీటి కుంటలు

- ఉపాధి హామీ పథకం కింద పనులు
- 32 వేల నీటి కుంటల నిర్మాణ లక్ష్యం
- ప్రతి గ్రామానికి పది చొప్పున మంజూరు

- రైతులకు మేలు చేసేలా నిర్మాణం
- వేసవిలో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు
- బాపట్ల జిల్లా ముందంజ.. పూర్తిగా వెనుబడిన పల్నాడు



రొంపిచర్ల : విప్పర్లపల్లిలో నీటి కుంటను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం నడుంకట్టింది. వేసవిలో ఉపాధి కూలీలకు పనులు పెద్దఎత్తున కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ రెండు లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మేలు చేసేలా విస్తృతంగా సేద్యపు నీటి కుంటల నిర్మాణం చేపడుతోంది. ఈ పనులకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి నిధులను కేటాయించింది. ప్రతి గ్రామ పరిధిలో కనీసం 10 నీటి కుంటలు నిర్మించే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 32 వేలు నీటి కుంటలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ వ్యయం రూ.137.60 కోట్లు అవుతుందని అంచనా వేశారు. నీటి కుంటల నిర్మాణంలో బాపట్ల జిల్లా ముందంజలో ఉండగా పల్నాడు జిల్లా పూర్తిగా వెనుబడి ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నీటి కుంటల నిర్మాణాలను పెద్దఎత్తున చేపట్టారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ పనులకు తిలోదకాలు ఇచ్చారు. వర్షాలు కురిసిన సమయంలో నీటి కుంటల్లో నీటిని నిల్వ చేసి ఆ తదుపరి పంటలకు వినియోగించుకునే విధంగా వీటి నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు రైతులను గుర్తిస్తున్నారు. పొలంలో నీటి కుంట నిర్మాణానికి అంగీకరించేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. నీటి కుంటల వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలను వారికి వివరిస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించి నీటి కుంటల పథకాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. వేసవిలో ఈ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ కాలంలో వ్యవసాయ పనులు ఉండవు. దీంతో ఉపాధి కార్మికులకు వారి గ్రామంలోనే నీటి కుంట పనులు కేటాయించి వారికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. నీటి కుంటలతో భూగర్భ జలాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. నీటి కుంటల నిర్మాణంపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో పెద్దఎత్తున నీటి కుంటల నిర్మాణాలకు రైతులు శంకుస్థాపనలు చేయగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పనులు ఇలా..

- పల్నాడు జిల్లాలో 14,000 సేద్యపు నీటి కుంటలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటికి 2,540 మంజూరు చేశారు. వీటిలో 850 కుంటల పనులు చేపట్టగా 87 పూర్తియ్యాయి. 3.43 శాతం పనులు పూర్తి చేసినట్లు డ్వామా అధికారులు తెలిపారు.
- గుంటూరు జిల్లాలో 8,500 నీటి కుంటల నిర్మాణం లక్ష్యం కాగా 584 చేపట్టి 113 పనులను పూర్తి చేశారు. నీటి కుంటల నిర్మాణం 19.35 శాతంగా నమోదైంది.
- బాపట్ల జిల్లాలో 9,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణ లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 1,752 పనులు చేపట్టారు. 466 పనులు పూర్తి చేయగా 26.60 శాతం నమోదైంది.

విద్యుత్.. ఊరట

- బడుగులకు బాసటగా నిర్ణయాలు
- విద్యుత్ భారం తగ్గింపునకు చేయూత
- నేతన్నలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- గుంటూరు, పల్నాడు, బాపట్లలో 31 వేల మందికి లబ్ధి
- సోలార్ విద్యుత్‌పై బీసీలకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ

విద్యుత్ భారంతో సామాన్యులు సతమతమవుతున్నారు. గత ప్రభుత్వంలో అస్తవ్యస్త విధానాలతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ క్రమంలో సామాన్యులకు విద్యుత్ భారం నుంచి ఊరట కలిగేలా ప్రభుత్వం పలు నిర్ణ యాలు ప్రకటించింది. అనేక రూ పాల్లో వారికి రాయితీలు అందిం చి ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే ట్రూడౌన్ చార్జీలు తగ్గించి స్వల్ప ఉపశమనం కల్పించిన ప్రభు త్వం విద్యుత్ భారాన్ని పూర్తిగా తొలగించే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు ఎస్సీల కు మాత్రమే ఉచిత విద్యుత్ అందుతుండగా ఇక నుంచి నేత కార్మికులకు కూడా ఆ అవకాశాన్ని అందించేందుకు ప్రభు త్వం కార్యాచరణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం సూర్య ఘర్ పథకానికి సంబంధించి బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సబ్సిడీని ప్రకటించింది.

గుంటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లుగా విద్యుత్ భారంతో అల్లాడిన బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు పలు రూపాల్లో ఉపశమన చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయనున్నది. ఈ ఉచిత విద్యుత్ స్కీము ద్వారా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అత్యధిక సంఖ్యలో చేనేత కార్మికులు ప్రయోజనం పొందనున్నారు. గుంటూరు జిల్లాలో 11 వేలు, పల్నాడు జిల్లాలో 3 వేలు, బాపట్ల జిల్లాలో 17 వేల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వేసిన లెక్కల ప్రకారం ఈ సంఖ్య 20వేల లోపు మాత్రమే ఉంది. నేతన్న నేస్తం భారం తగ్గించుకోవడానికి నిబంధనల పేరుతో నేతన్నల సంఖ్యను భారీగా తగ్గించింది. ఆ కారణంగా నాడు అనేక మంది నేతన్న నేస్తం ప్రయోజనాన్ని కోల్పోయారు. నేడు ఉచిత విద్యుత్ ప్రయోజనానికి దూరమయ్యే ప్రమాదమూ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే చేసి అర్హులైన నేతన్నలందరికీ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని కల్పిస్తామని చెబుతోంది. కాగా మూడు జిల్లాల్లో పవర్‌లూమ్ మగ్గాలు పదుల సంఖ్యలోనే ఉన్నాయి. వారికి నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తారు.

● సూర్యఘర్‌కు మరింత సబ్సిడీ..

పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడం కోసం కేంద్రం ప్రవేశ పెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలకు ఇప్పటికే 2 కిలో వాట్ల సోలార్ ప్లాంట్లను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న ప్రభుత్వం, బీసీ వర్గాలకు అదనపు సబ్సిడీని ప్రకటించింది. డ్వాక్రా గ్రూపు మహిళల్లో అవగాహన కల్పిస్తూ, వారిని సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే దిశగా ప్రోత్సహిస్తున్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి 2 కిలో వాట్ల ప్లాంటు ఏర్పాటుకు రూ.లక్షా 20 వేలు ఖర్చవుతుంది. అందులో కేంద్రం రూ.60 వేలు సబ్సిడీగా ఇస్తోంది. ఈ సబ్సిడీకి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అదనంగా మరో 20 వేలు సబ్సిడీ ఇస్తోంది. దీంతో రూ.30, 40 వేల రుణంతో బడుగులు సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చు. మూడు జిల్లాల్లో 10 లక్షల కుటుంబాల వరకు ఈ ప్రయోజనం కలిగే వీలుంది. పక్కా ఇల్లు ఉన్న వారిని ప్రోత్సహించేందుకు డ్వాక్రా సంఘాలను భాగస్వాములను చేశారు. మహిళల్లో అవగాహన కల్పించి గ్రూపుల ద్వారా రుణాలు అందించి సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు కృషి చేస్తున్నారు. సొంత ఇళ్లు లేనివారికి ప్రభుత్వం ఇచ్చే ఇళ్లతోపాటు సోలార్ ప్లాంటును కూడా అనుసంధానం చేస్తే మరింత ఎక్కువ మందికి లబ్ధి చేకూరుతుంది.

30న అమరావతిలో పీ-4 ప్రారంభోత్సం

ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

తుళ్లూరు(వెలగపూడి), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న ప్రజలు ప్రైవేటు భాగస్వామ్యం పీ4 ప్రారంభ కార్యక్రమాన్ని 30న ఉగాది రోజున సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. రాజధాని అమరావతి వేదికగా జరిగే ఈ కార్యక్రమానికి వెలగపూడి అసెంబ్లీ సచివాలయం వెనక 50 ఎకరాలను ఎంపిక చేయగా ఇక్కడ ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం ఆయా పనులను గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. అంతక ముందు సచివాయంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే కలెక్టర్ల సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన నాగలక్ష్మి అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే నెల మూడో వారంలో ప్రధాని మోదీ రాజధాని పనులకు శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సచివాలయం ఒకటో భవనం వెనక ఈ-6, ఎన్-9 రోడ్ల జంక్షన్‌లో 200 ఎకరాల ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ప్రొటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ, జిల్లా ఉపాధి కల్పనాధికారి దుర్గాబాయ్, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, తహసీల్దార్లు సుజాత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వైద్యశాలలో అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, చదలవాడ అరవిందబాబు

ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠం

- ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం
- పిడుగురాళ్ల వైద్య కళాశాల వచ్చే ఏడాది ప్రారంభం
- సత్తెనపల్లి సభలో మంత్రి సత్యకుమార్‌యాదవ్

సత్తెనపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నట్లు మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో అదనపు భవనం, అదనపు బ్లాకులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేయగా తాము ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పిడుగురాళ్లలో వైద్య కళాశాలను పీపీ పద్ధతిలో ప్రారంభిస్తామన్నారు. నరసరావుపేట ఆస్పత్రిలో రూ.36 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభిస్తామన్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆస్పత్రిలో రెండు థియేటర్లు, ఐసీయూ అందుబాటులోకి రావడంతో ఇక నుంచి అన్ని రకాల ఆపరేషన్లకు అవకాశం కలిగిందన్నారు. అనంతరం పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో రైతులు నిల్వ చేసుకున్న పంటల ఉత్పత్తులకు సంబంధించిన చెక్కులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబు, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, డీసీహెచ్ రంగారావు, డీఎంహెచ్‌వో రవికుమార్, టీడీపీ నేత మన్నెం శివనాగమల్లేశ్వర రావు, ఎలినేడి రామస్వామి, కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్, చల్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ పోట్ల అరుణకుమారి, ఎలినేడి లక్ష్మీతులసి, జవ్వాజి రామ్మోహనరావు, మారెళ్ళ వీరాంజనేయులు, శిరిగిరి మణికంఠ, నూర్‌బాషా జానీ బాబు, కట్టా శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (సోమవారం సాయంత్రం)

సహరి : 4.52 (మంగళవారం ఉదయం)

కేంద్ర, రాష్ట్రాల సహకారంతో మరింత అభివృద్ధి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కొల్లిపర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిధులను తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర సమీపంలో రేపల్లె బ్యాంక్ కెనాల్‌పై రూ. 4.19 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ నూతన వంతెన నిర్మాణానికి రాష్ట్ర మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలిసి పెమ్మసాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్ర



వంతెన నిర్మాణానికి సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి

శేఖర్ మాట్లాడుతూ మనోహర్ గెలవడం వలన ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనునట్లు చెప్పారు. రైతులకు ఉపయోగపడే విధంగా డొంకరోడ్లను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఈ వం తెన నిర్మాణం జరిగితే కొల్లిపర, తూములూరు, చివలూరు, అత్తోట తదితర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగం అన్నారు. మే నెల చివరి నాటికి ఈ వంతెన నిర్మా ణం కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులు, సంబంధిత కాంట్రాక్టులకు ఆదేశించడం జరిగిందన్నారు. కొద్ది రోజుల్లో రూ. 20 కోట్లతో డొంకరోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తానని ప్రకంటించారు. డొంకరోడ్ల నిర్మాణానికి పవన్‌కల్యాణ్ రూ. 10కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మనోహర్, పెమ్మసాని ఇద్దరి అనుభవంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పధంలో ముం దుకు తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మా జీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, కూటమి నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, అడపా నారాయణరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, అద్దంకి వేణుగోపాల్, దాసరి నరసయ్య, పెరిగల రాంబాబు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 520.10 అడుగులు ఉంది. ఇది 149.45 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 15,624 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

కొనుగోళ్లు ఫుల్... ధరలు డల్

● మిర్చికి గుంటూరు ఏఎంసీలో పెరగని ధర ● మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ధరకి అటు ఇటుగానే రైతుకు చెల్లింపు ● ఎక్స్‌పోర్టు డిమాండ్ ఉన్నప్పటికీ ఎందుకు రేటు రావడం లేదో?

గుంటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గత రెండున్నర నెలల నుంచి మిర్చియార్డులో వాణిజ్యం జరిగిన ప్రతీ రోజు లక్షా 20 వేల టిక్కీలు చొప్పున కొనుగోళ్లు జరుగుతూనే ఉన్నాయి. వీటిల్లో ఎక్స్‌పోర్టు వెరైటీ అయిన తేజ 50 శాతం పైగానే మార్కెట్‌ని ఆక్రమిస్తున్నది. నిత్యం చెన్నై పోర్టుకి ఇక్కడి నుంచి కంటైనర్లు బయలుదేరి వెళుతున్నాయి. దేశీయంగా ఎర్రరంగు కారం కోసం వినియోగించే 341 వెరైటీకి మంచి డిమాండ్ ఉన్నది. బ్యాడిగి, షార్క్ వంటి రకాల మిర్చిలు కూడా అమ్ముడౌతున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుంటే మిర్చికి డిమాండ్ ఉందన్న విషయం సుస్పష్టం. అయినప్పటికీ రైతు ఆశించిన ధర రావడం లేదు. క్వింటాల్ రూ.11,500లకు అటు ఇటుగానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి. గతంలో డిమాండ్ ఉంటే రేటు పెరిగేది. అలాంటిది ఈ ఏడాది సీజన్ మొదలుకుని ధర ఒకే విధంగా స్థిరంగా కొనసాగుతుండటం ఎవ్వరికీ అంతుచిక్కడం లేదు. ఫలాన కారణం వలన రేటు పెరగడం లేదని అటు మార్కెటింగ్ అధికారులు, ఇటు మిర్చి వర్తకులు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు.

ఈ ఏడాది మిర్చి సీజన్ జనవరి నెలలో సంక్రాంతి పండగ తర్వాత ప్రారంభమైంది. ప్రతీ శని, ఆదివారం, పండగ రోజు సెలవుదినాలు తీసేస్తే దాదాపుగా 50 రోజులకు పైగానే మిర్చియార్డులో వాణిజ్యం జరిగింది. ఈ నేపథ్యంలో 60 నుంచి 65 లక్షల మిర్చి టిక్కీల వరకు విక్రయాలు జరిగాయి. అధికారిక గణాంకాల ప్రకారం యార్డులో ప్రస్తుతానికి 51 వేల మిర్చి టిక్కీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. మరోవైపు కోల్డ్‌స్టోరేజ్‌లలో 60 శాతం మేరకు ఖాళీ ఉన్నది. చెన్నై నుంచి నిత్యం కంటైనర్లు వచ్చి లోడింగ్ చేసుకోవడాన్ని పరిశీలిస్తే చైనాకు ఎగుమతులు ఆశాజనకంగానే ఉన్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు మిర్చిని ఇక్కడికి తీసుకొస్తున్నారంటే కొనుగోళ్లు జరుగుతుండటం వలనేనన్న విషయం తేలిపోతున్నది. మిర్చికి ఉన్న డిమాండ్‌ని ఈ పరిణామాలు, పైన పేర్కొన్న గణాంకాలే కళ్లకు కడుతున్నాయి. ఇంత డిమాండ్ ఉంటే ధర కనీసం క్వింటాల్‌కు రూ. 16 వేలు దాటిపోవాలి. అలాంటిది రూ. ఐదు వేలు తక్కువగా రూ. 11 వేల వద్ద ఊగిసలాడుతున్నది.

వ్యాపారస్థులు, అధికారుల అభిప్రాయం ఇలా...

గత రెండేళ్లలో మిర్చికి అధిక ధర వస్తుందని ఆశించి రైతులు, వ్యాపారస్థులు మిర్చిని కొనుగోలు చేసి కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేశారు. అయితే వారి అంచనాలకు విరుద్ధంగా మార్కెట్ పెరగలేదు. ఈ అనుభవంతో ప్రస్తుత సీజన్‌లో రైతులెవ్వరూ కూడా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వచేసి ధర పెరగడాని కోసం ఎదురు చూడటం లేదు. వ్యాపారస్థులు కూడా పెద్దగా స్టాకు పెట్టుకోవడం లేదు. ఈ కారణాలతోనే ధరలు పడిపోయాయని వ్యాపారస్థులు, అధికారులు ఒక అంచనాకొచ్చారు.

మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ అమలు చేయలేని పరిస్థితి

మిర్చికి ధర పడిపోవడంతో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీం కింద మిర్చి కనీస మద్దతు ధరని రూ. 11,781గా నిర్ణయించింది. అయితే ఇందుకు పలు నిబంధనలను పొందుపరిచింది. ఈ-క్రాప్‌లో రైతు పేరు, విస్తీర్ణం, మిర్చి సాగు చేసిన వెరైటీ తప్పక నమోదై ఉండాలని స్పష్టం చేసింది. అలానే తేమ శాతం, మిరపకాయల పొడవు ఎంత ఉండాలి వంటి నిబంధనలు పెట్టడంతో రైతులు ఆ స్కీమ్ గురించి పట్టించుకోవడం లేదు. మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో తమకు క్వింటాల్ రూ. 11,500 ధర వచ్చినా చాలన్న ధోరణితో విక్రయించేస్తున్నారు.



చెన్నై నుంచి వచ్చిన కంటైనర్‌కి చైనాకి ఎగుమతి అయ్యే మిర్చిని లోడింగ్ చేస్తున్న కార్మికులు

ఆధునిక యంత్రాలతో అమరావతి పనులు

మంగళగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణానికి రమారమి రూ.50 వేల కోట్లకు పైగా నిధులు సమకూరాయి. మరికొద్ది రోజుల్లో అమరావతిలో ఎటుచూసినా నిర్మాణ పనుల సందడి కనిపించబోతుంది. ఈ క్రమంలో 15 రోజుల నుంచే ఈ హడావిడి తాలూకు సన్నాహక సందడి పలుచోట్ల కనిపిస్తోంది. ఈ క్రమంలో అమరావతిలో భారీ యంత్రాలు, ఎన్నడూ చూడని సరికొత్త రకాల పనిముట్లు, అత్యంత కఠినమైన, భారమైన పనులను చాలా సులువుగా చేయగల సామాగ్రి చూపరులకు కనువిందు చేస్తున్నాయి. సరిగ్గా ఈ తరహా యంత్ర పరికరమే పై ఫొటోలో కనిపిస్తున్న సాధనం. దీనిని టబ్ గ్రైండర్ అని అంటారు. ప్రస్తుతం రాజధానిలో చాలా చోట్ల ముళ్లకంపలు, పలు రకాల చెట్లు ఏపుగా పెరిగాయి. వాటిని తొంభై శాతం వరకు తొలగి స్జా జంగిల్ క్లియరెన్స్ చేశారు. అలా తొలగించిన మొక్కల తాలూకా కంపలను పొక్లెయినర్ల సాయంతో ఈ టబ్ గ్రైండర్‌లో వేస్తున్నారు. ఈ గ్రైండర్ ఈ కంపలను చిన్న చిన్న ముక్కలుగా చేసి పొడి రూపంలోకి మార్చేస్తోంది. ఈ పౌడర్‌ను లారీల ద్వారా థర్మల్ పవర్ స్టేషన్లకు తరలిస్తున్నారు. అక్కడ బొగ్గుతో ఈ పౌడర్‌ను కలిపి తద్వారా విద్యుదు త్పత్తిని చేస్తారని చెప్తున్నారు. ఈ పౌడర్‌తో పలు రకాల పేపర్లను, ప్యాకింగ్ చేసే ఉపకరణాలను తయారు చేస్తారని తెలిసింది.



మొక్కలు, ముళ్ల కంపలను పొడర్‌గా మారుస్తున్న టబ్ గ్రైండర్

శ్రీబగళాముఖి అమ్మవారి సన్నిధిలో జడ్జిలు రమాదేవి, వెంకటేశ్వరరావు

పిట్టలవానిపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రైల్వేకోర్టు జడ్జి పి.రమాదేవి, నూజివీడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు దంపతులు ఆదివారం శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈసందర్భంగా రైల్వేకోర్టు జడ్జి పి.రమాదేవి, నూజివీడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, రాజేంద్ర, ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావు దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి

మాజీ సైనిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సాంబశివరావు

కర్లపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెంకు చెందిన ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు ఆదివారం విజయవాడలో జరిగిన మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలలో భారీ మెజార్టీతో విజయం సాధించారు.



తాండ్ర సాంబశివరావును అభినందిస్తున్న పలు జిల్లాల సైనిక సంక్షేమ సంఘం నాయకులు

తాండ్ర సాంబశివరావు మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ జిల్లాలోని మాజీ సైనికుల అభ్యున్నతికి విశేష కృషిచేశారు. రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల లో పోటీలో నిలిచి ప్రత్యర్థి గరిమెళ్ళ శివనాగేశ్వరరావుపై భారీ మెజార్టీతో సాధించారు. సాంబశివరావు మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షులుగా విజయం సాధించటం పట్ల బాపట్లజిల్లాలోని మాజీ సైనికులే కాకుండా రాష్ట్ర నలుమూలలలో ఉన్న మాజీ సైనికులు సాంబశివరావుకు అభినందనలు తెలిపారు. సాంబశివరావు గెలుపు మాజీ సైనికులందరదని బాపట్ల మాజీ సైనికులు కొనియాడారు. విజయం సాధించిన తాండ్ర సాంబశివరావును రాష్ట్రంలోని అన్ని జిల్లాల మాజీ సైనిక సంక్షేమసంఘం నాయకులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

పట్టాలు తప్పిన నరసపూర్ - గుంటూరు రైలు

గుంటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రైలుపట్టాల మీదకు హఠాత్తుగా పశువులు రావడంతో నరసపూర్ నుంచి గుంటూరుకు వస్తున్న నంబరు. 67247 రైలు మంగళగిరి - నంబూరు మధ్యన పట్టాలు తప్పింది. ఈ రైలు ఆదివారం సాయంత్రం 6.50కి మంగళగిరికి చేరుకొని 6.54కి బయలుదేరిన కాసేపటికే పట్టాలు తప్పింది. దీంతో రైల్వే అధికారులు, సిబ్బంది క్రేన్లతో రైలుని తిరిగి పట్టాలపైకి తీసుకొచ్చారు. అనంతరం నంబూరుకు 7.50కి చేరుకొని రాత్రి 8.35కి గుంటూరుకు చేరుకొన్నది. దీంతో 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని విజయవాడ వరకే నడిపి పాక్షికంగా విజయవాడ - గుంటూరు మధ్యన రద్దు చేశారు. అలానే నంబరు. 57202 గుంటూరు - విజయవాడ ప్యాసింజర్‌ని పూర్తిగా రద్దు చేశారు. నంబరు. 07029 అగర్తల - సికింద్రాబాద్ రైలుని విజయవాడలో మూడు గంటలకు పైగా నిలిపేశారు. అలానే బెంగళూరు సిటీకి వెళ్లాల్సిన ప్రశాంతి, హుబ్లీకి బయలుదేరిన అమరావతి ఎక్స్‌ప్రెస్‌లను కూడా విజయవాడలో నిలిపి మరమ్మతులు చేశాక రాత్రి 11 గంటల సమయంలో గుంటూరుకు తీసుకొచ్చారు.

కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడి

8 ద్విచక్ర వాహనాలు, రెండు కోడి పుంజుల స్వాధీనం

కొల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కోడి పందాల స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఆదివారం మండల పరిధిలోని తాడిగిరిపాడు గ్రామ డొంకలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలుకు సమాచారం అందడంతో సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. పందెం రాయుళ్లు పరారు కాగా, 8 ద్విచక్ర వాహనాలు, రెండు కోడి పుంజులు, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పందెం రాయుళ్లను గుర్తించి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ దారుణహత్య

తాడేపల్లి(కొలనుకొండ)మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండ సమీపంలో హైవే పక్కన గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సదరు మహిళను గొంతుకోసి హతమార్చినట్లు తెలుస్తోంది. మృతురాలు కొద్దిరోజులుగా హైవేరోడ్డువద్ద వ్యభిచారవృత్తి నిర్వహిస్తున్న మహిళని స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి విచారణ చేపడుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వాసుపత్రికి తరలించి హత్యకేసుగా నమోదు చేశారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



సౌందర్య(ఫైల్)

తాడేపల్లి(కుంచనపల్లి),మార్చి 23(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక కుక్కమళ్ల సౌందర్య(26) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుంచనపల్లి గ్రామానికి చెందిన నల్లమలపు సంజీవరావు, విజయకుమారి దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె. సంజీవరావు వృత్తిరీత్యా ముంబైలోని హార్బర్‌లో ఉద్యోగం చేస్తూ ఇటీవల రిటైరయ్యారు. ముగ్గురు కుమారులకు వివాహం కావడంతో ఎవరికివారు వేరుకాపురాలు ఉంటున్నారు. కూతురు సౌందర్యను బీఎస్సీ కంప్యూటర్స్ చదివించాడు. 2022లో అదేగ్రామానికి చెందిన కుక్కమల్ల రాజు అనే యువకుడిని ప్రేమించి పెళ్లిచేసుకుని తల్లిదండ్రులకు దూరంగా ఉంటోంది. ఇటీవల ప్రాతూరులోని ఎమి ఇంటర్నేషనల్‌స్కూల్‌లో సౌందర్య టీచర్‌గా పనిచేస్తోంది. సౌందర్యను భర్త రాజు, కుటుంబసభ్యులు కట్నం తేలేదని తరచూ డబ్బుకోసం వేధించేవారు. భర్త తనను వేధిస్తున్నాడని సౌందర్య తండ్రి సంజీవరావుకు శనివారం ఫోన్‌చేసి చెప్పింది. ఆదివారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలియడంతో సంజీవరావు, కుమారులు మంగళగిరి ఎయిమ్స్‌కు వెళ్లడంతో అప్పటికే సౌందర్య మృతి చెందిందని వైద్యులు తెలిపారు. భర్త, కుటుంబసభ్యుల వేధింపులతోనే తన కుమార్తె మృతి చెందిందని తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు. సంజీవరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసైన్డ్‌భూములలో అక్రమంగా లాడ్జిల నిర్మాణం

కబ్జా చేస్తున్నా పట్టించుకోని అధికారులు

బాపట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పర్యాటకుల అవసరాన్ని గుర్తించి కొంతమంది వ్యాపారులు అసైన్డ్‌భూములను కొనుగోలు చేసి మరికొందరు లీజుకు తీసుకుని ఇంకొందరు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన అక్రమ కట్టడాల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే అనేక లాడ్జిలు ఇక్కడ వెలిశాయి. పర్యాటకేంద్రంగా ప్రసిద్ధిగాంచిన ఈప్రాంతంలో ప్రభుత్వం లాడ్జిలను అందుబాటులోకి తీసుకురాకపోవటం, పర్యాటకులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవటంతో ప్రైవేట్ లాడ్జిలవైపు చూస్తున్నారు. దీనిని వ్యాపారంగా మల్చుకుని అనేకమంది అక్రమంగా లాడ్జిలు నిర్మించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఇదేప్రాంతంలో మరో లాడ్జి నిర్మాణం చేపట్టటంతో స్థానికులు నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. అయినప్పటికీ పంచాయతీరాజ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటంలేదు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని అక్రమకట్టడాలకు అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా ఈవిషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి విజయసారధిని వివరణ కోరగా తొలుత ఇసుక పక్కకు వెళ్ళిపోతుందని చెప్పి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్న వ్యక్తులు ఆదివారం సెలవు కావటంతో నిర్మాణాలు ప్రారంభించినట్లు తెలిసిందన్నారు. వెంటనే వెళ్ళి నిర్మాణాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.



సూర్యలంక సముద్రతీరంలో అక్రమంగా నిర్మిస్తున్న లాడ్జి

అమ్మవారి జాతరకు పోటెత్తిన భక్తులు

దుర్గి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అడిగొప్పుల శివారులో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జాతరను వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఆదివారం లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు జరిపారు. అమ్మవారి పల్లకి సేవ అలరించింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం, మంచినీరు అందించాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మేళతాళాల మధ్య కుంకుమ బండ్లు ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలిరావడం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈవో సైదమ్మబాయి, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు యాగంటి వెంకటేశ్వర్లు, గురజాల డీఎస్పీ జగదీష్, చిలకలూరిపేట సీఐ సుబ్బనాయుడు, దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్‌లు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో పొంగళ్లతో భక్తులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

పొన్నూరులో వరుస చోరీలు

వరుసగా ఆరు దుకాణాల్లో దొంగతనం

పొన్నూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఆదివారం తెల్లవారు జామున వరుసచోరీలు అర్బన్ పోలీసులకు పెనుసవాలుగా మారాయి. పోలీస్ స్టేషన్‌లకు కూటవేటు దూరంలో వరుసగా ఐదు దుకాణాలతో పాటు మరోప్రాంతంలోనూ చోరీ సంఘటన జరిగింది. అర్బన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారి జీబీసీ రోడ్డు వెంట తెల్లవారుజామున 2 గంటల సమయంలో హస్సికవైన్స్ ఓ ఫైనాన్స్ కంపెనీతో పాటు, కళా టీ పాయింట్‌లో దుండగుడు షెట్టర్ తాళాలు పగులగొట్టి దుకాణాల్లోకి ప్రవేశించి చోరీలకు పాల్పడ్డాడు. అక్కడ నుంచి నిముషాల వ్యవధిలోనే పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న రెండు ఆటోమొబైల్స్ దుకాణాల్లో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించడమే కాకుండా తాపీగా కౌంటర్‌ల వద్ద కూర్చొని షోరూమ్‌లలో ఉన్న నగదు, వస్తు సామగ్రి చోరీచేసినట్లు సీసీటీవీ రికార్డులలో నమోదైంది. అక్కడి నుంచి గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న బెల్లం కొట్ల బజారులోకి ప్రవేశించి హోల్‌సేల్ దుకాణాల తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డాడు. ఈ వరస చోరీలు ఆదివారం చోటు చేసుకోవడంతో సంఘటన జరిగిన రోజు సెలవుదినం కావడంతో దుకాణ యజమానులను రప్పించి పోలీసులు చోరీ జరిగిన సొత్తుగురించి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఐతే ఒకే దుండగుడు ద్విచక్రవాహనంపై సంచరిస్తూ రెక్కీ నిర్వహించి ప్రధాన రహదారి వెంట వరుస చోరీలకు పాల్పడుతుంటే నిఘా వ్యవస్థ కాని, బీటు సిబ్బంది కాని ఏం చేస్తున్నారని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం పట్టణ ప్రధాన కేంద్రం ఐలెండ్ సెంటర్‌లో రెండు వైన్‌షాపులతోపాటు ఓ సూపర్‌బజారులో ఇదేవిధంగా చోరీలు జరిగాయి. తాజాగా నిడుబ్రోలులో ఓ ప్రముఖులకు చెందిన గృహంలోకి ప్రవేశించిన దుండగులు విలువైన వస్తుసామగ్రిని దొంగతనంచేసి తాపీగా వెళ్లిపోయారు. వరుస చోరీలు జరుగుతుంటే వాటిని అరికట్టాల్సిన పోలీసులు చోద్యం చూడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చోరీల ఉధృతి అరికట్టకపోతే ప్రజలు కష్టపడి సంపాదించుకున్న సొత్తు చోరుల పాలవుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా నిఘా వ్యవస్థ నిద్రమాని వరుస చోరీలు అరికట్టాలని పట్టణ వాసులు పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.



చోరీలు జరిగిన దుకాణాలను పరిశీలిస్తున్న సీఐ రవికిరణ్

పల్నాడు వార్తలు

భగత్‌సింగ్ త్యాగాలు చిరస్మరణీయం

దాచేపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ త్యాగాలు నేటి యువతకు చిరస్మరణీయం అన్నారు. ఆదివారం నారాయణపురంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని జరిపారు. అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోని యువత చెడుమార్గాలకు పోకుండా భగత్‌సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మందపాటి రమణారెడ్డి, కొమర వెంకటరావు, బుర్రి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రాజుపాలెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న వంద క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్న సంఘటన మండలంలోని రెడ్డిగూడెం గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొక్కపాడు వైపు నుండి నకరికల్లు వైపు వెళ్తున్న లారీలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక ఎస్సై వేణుగోపాల్ తన సిబ్బందితో వెళ్లి దాడిచేసి పటుకున్నారు. డ్రైవర్ రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

సత్తెనపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు చెల్లించనివారు వెంటనే చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 31వ తేదీ లోపు బకాయిలు చెల్లించకపోతే మునిసిపల్ చట్టం ప్రకారం ఎటువంటి నోటీసు జారీ చేయకుండానే ఇంటి నీటికుళాయి కనెక్షన్ తొలగిస్తామన్నారు. మొండి బకాయిదారులపై కోర్టులో ఫిర్యాదు చేస్తామన్నారు.

25న నిర్వహించే ఇంటర్వ్యూ రద్దు

● ఎంపీడీవో సరోజనీదేవి

రెంటచింతల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా వ్యక్తి గత రుణాలను పొందడానికి బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో ఈనెల 25న తేదీన నిర్వహించనున్న ఇంటర్వ్యూ రద్దయినట్లు ఎంపీడీవో కె.సరోజనీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి సమయాన్ని పొడిగించారన్నారు.

రూ.400తో మూడేళ్ల వరకు పశువుల బీమా

● డాక్టర్ బషీర్

రెంటచింతల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రసుత్తం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకంతో రైతులు ఒక్కో పాడి ఆవుకు రూ.400 ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల వరకు బీమా వర్తిస్తుందని పశువైద్యాధికారి బషీర్ చెప్పారు. ప్రస్తుతం అమలుచేస్తున్న పశు బీమా పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామని క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

● దుర్వాసనతో తల్లడిల్లిపోతున్న సారంగపల్లి అగ్రహారం వాసులు
● నెలల తరబడి మరమ్మతులకు నోచుకోని కాలువలు
● పట్టించుకోని అధికారులు




సారంగపల్లి అగ్రహారం గ్రామంలో మురుగుతో పూడిపోయిన కాలువలు, రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు



దాచేపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి డ్రెయినేజ్ వ్యవస్థ మరమ్మతులకు నోచుకోకపోవటంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మురుగు నీటి పక్కనేవున్న తాగునీటి బోరుల్లోకి మురుగునీరు చేరటంతో తాగునీరు కలుషిత మై అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. కానీ పారిశుధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు మాత్రమే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దాచేపల్లి మండల కేంద్రానికి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న సారంగపల్లి అగ్రహారం గ్రామంలో ఈ దుస్థితి నెలకొంది. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన ప్రజలు అధికంగా నివాసం ఉంటున్నారు. ఈ గ్రామంలో ప్రజలంతా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పగలంతా వ్యవసాయ పనులు పూర్తిచేసుకొని సాయంత్రానికి ఇంటికి చేరకున్న గ్రామస్తులకు మురుగు కాలువల నుంచి వచ్చే దుర్వాసన ఇబ్బంది కలిగిస్తోంది. నెలలు తరబడి డ్రెయినేజ్‌లో పూడిక తొలగించకపోవటంతో మురుగునీరు ఎక్కడికక్కడికే నిలిచిపోయి దోమలకు నివాసయోగ్యంగా మారింది. రోడ్డుపైనే మురుగు నిల్వ ఉండి బురదమయంగా మారటంతో వాహనచోదకులు, పాదచారులు మురుగులో జారిపడిన ఘటనలున్నాయి. మురుగునీటిలో ఉన్న పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైతే రోగాలబారినపడే ప్రమాదం ఉంది. అయినా అధికారులు మాత్రం ఎటువంటి ముందస్తు చర్యలు గాని, పారిశుధ్య చర్యలు గాని చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని, డ్రెయినేజ్‌లో పూడిక తీయించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇఫ్తార్ విందు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

హిందూ, ముస్లింల ఐక్యతను దెబ్బతీసే అవకాశం ఇవ్వొద్దు

● హజ్ యాత్రకు రూ.2 లక్షలు
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉంటారు.. ఈ ఐక్యతను దెబ్బతీసే అవకాశం ఇవ్వొద్దు.. ఇక్కడ యరపతినేని ఉన్నాడు అనేది మరచిపోవద్దు.. అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం దాచేపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు నాయబ్ అబ్దుల్లా ఆధ్వర్యంలో ఆరువేల మంది ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. మౌజన్‌లు, ఇమామ్‌లకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత దాచేపల్లిలోని పెద్ద మసీదులో జరిగిన నమాజ్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ముస్లిం సోదరులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ దాచేపల్లిలో నాగులేరుపై లో లెవల్ చప్టా నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కబ్రస్తాన్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, విద్యుత్‌లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. గురజాల నియోజక వర్గంలో హజ్‌యాత్ర చేస్తున్న ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.లక్ష, తన వ్యక్తిగత నిధుల నుంచి రూ.లక్ష కలిపి రూ.2లక్షలు హజ్ యాత్రికులకు ఇవ్వనున్నట్టు తెలిపారు. షాదీఖానా, మసీదు నిర్మాణాలకు సహకరిస్తామన్నారు. ముస్లింల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దాచేపల్లిలో ముస్లిం సోదరులు తనకు ఎప్పుడు అండగా ఉన్నారని గుర్తుచేసుకున్నారు. ముస్లిం పేద విద్యార్థికి రూ 30వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, ముస్తఫ్ మౌలానా, యూసఫ్ మౌలానా, ఫరూక్ మౌలానా, రఫీ మౌలనా, అబ్దుల్ రెహ్మాన్ మౌలానా, టీడీపీ అధికార ప్రతినిధి తుల్లా, మాజీ సర్పంచ్ వలి తదితరులు పాల్గొన్నారు.

రూ.5.66కోట్లతో బ్రిడ్జి నిర్మాణం

● శంకుస్థాపన చేసిన మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కన్నా



మొక్కపాడు గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొక్కపాడు గ్రామ సమీపంలో ఎద్దువాగుపై బ్రిడ్జి నిర్మాణానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణలు ఆదివారం శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించనున్న ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.5కోట్ల 66లక్షల నిధులు ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే తెలుగుదేశం పార్టీ ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో భవిష్యత్‌లో వరద వచ్చే అవకాశం లేదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మన్నెం శివనాగమల్లేశ్వరావు, పూజల వెంకటకోటయ్య, సర్పంచ్ కణదం పద్మజ శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, గుత్తా వెంకట్రావు, మర్రి వెంకట్రామిరెడ్డి, అంకాళ్ల ప్రభుదాసు, కణదం వెంకట్రావు, మొరసా శ్రీను, రెడ్డిగూడెం వాసు, షేక్ అల్లాబక్షు, పులిబండ్ల సాంబశివరావు, చొక్కా శ్రీను, ఎస్.నరసింహారావు ఉన్నారు.

వంద పడకల ఆసుపత్రి ప్రకటనతో హర్షం

రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేట్ చేయాలనే ప్రతిపాదనను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం సత్తెనపల్లి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముందు ఉంచారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ 175 నియోజకవర్గాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటుచేయటంతో పాటు రాజుపాలెంలో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేస్తామని చెప్పటంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కన్నాను ప్రజలు అభినందిస్తున్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే యరపతినేని

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

పిడుగురాళ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవెల్లంపల్లికి చెందిన వైసీపీ నేతలు ఆదివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీ విధానాలతో విసుగుచెంది, కూటమి ప్రభుత్వం గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు చెప్పారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వీరికి టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో గొర్రె శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, నాగరాజు, దుర్గారావు, గంజనబోయిన చిన సింగరయ్య తదితరులు ఉన్నారు.



బత్తుల నాగరాజుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నకరికల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చీమలమర్రికి చెందిన బత్తుల నాగరాజుకు ఆదివారం సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.1,95,829 చెక్కును వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణలు అందజేశారు. గత నెలలో చీమలమర్రికి చెందిన బత్తుల నరసింహాకు శస్త్రచికిత్స కోసం రూ.4.45లక్షలు ఖర్చయ్యాయి. ఫిబ్రవరిలో సీఎం సహాయనిధికి కోసం ఎమ్మెల్యే కన్నా సిఫార్సు చేశారు. ఆదివారం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో మంత్రి సత్యకుమార్ యాదవ్, కన్నా లక్ష్మీనారాయణ బాధితుని తండ్రి బత్తుల నాగరాజుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పసల ఏడుకొండలు, మేడికొండ శ్రీనివాసరావు, బత్తుల ఏడుకొండలు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేపీ నేతలు

మాచర్లటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆదివారం మాచర్లకు చెందిన బీజేపీ నేతలు కలిశారు. సత్తెనపల్లి వచ్చిన మంత్రిని బీజేపీ నేతలు కలిసి మాచర్ల నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత, ఔషధ కేంద్రాల ఏర్పాటు, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం తదితర అంశాలపై వినతిపత్రం అందించారు. మంత్రిని కలిసినవారిలో గంజర్ల లక్ష్మి, గుమ్మడి నాసరయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

మాచర్ల - బెంగళూరు బస్ సర్వీసు రద్దు

మాచర్లటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మాచర్ల నుంచి బెంగళూరు వెళ్లే సూపర్ లగ్జరీ బసు సర్వీసును రద్దు చేశారు. ఆర్టీసీతోపాటు ప్రైవేటు సర్వీసులు కూడా నడుపుతున్నందున ఆర్టీసీకి ఆదాయం తగ్గిపోయింది. దీంతో అధికారులు ఆర్టీసీ సర్వీసులు రద్దు చేశారు. అలాగే మాచర్ల నుంచి చెన్నై బస్సు సర్వీసు కూడా నష్టాల్లో నడుస్తోంది. ఈ సర్వీసును కూడా రద్దు చేసే అవకాశం కనిపిస్తోంది. అలాగే గతంలో మాచర్ల నుంచి కర్నూల్ అల్ట్రా డీలక్స్ బసు సర్వీసును కూడా నష్టాలు రావడంతో నిలిపివేశారు.

మల్లవరం మేజర్‌కు పెరిగిన నీటి విడుదల

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చొరవ



మల్లవరం మేజర్‌కు విడుదలవుతున్న నీరు

రెంటచింతల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం కల్లా సమస్య పరిష్కారం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జోక్యంతో ఇరిగేషన్ అధికారులు బుగ్గవాగు రిజర్వాయర్ సమీపంలోని ముత్యాలంపాడు వద్ద వున్న 8 గేట్లకుగాను 3 గేట్లను 4 అడుగుల మేర కిందకు దించి ఆదివారం నీటిని విడుదల చేశారు. దీనివలన మల్లవరం మేజర్‌కు ప్రస్తుతం విడుదలవుతున్న 60 క్యూసెక్కుల నుంచి 100 క్యూసెక్కులకు పెరగనుంది. ఎండిపోతున్న వరి, మిర్చి పైర్లను కాపాడడానికి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే జూలకంటికి అన్నదాతలు కృతజ్ఞతలు తెలిపారు. డీఈ మురళీ నేతృత్వంలో అధికారుల బృందం చర్యలు చేపట్టింది.

త్వరలో కార్పొరేషన్‌ల పునరుద్ధరణ

● అర్హులందరికీ రుణాలు
● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లు పునరుద్ధరించి వాటిద్వారా అర్హులైన అందరికీ రుణాలు అందజేస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం చిగురుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం నీరుగార్చిందని, తద్వారా అనేకమంది లబ్ధిదారులు నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని కార్పొరేషన్‌లను పునరుద్ధరించి సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తుందన్నారు. సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం చేయూత నిస్తుందని తెలిపారు. గత వైసీపీ పాలకులు రాష్ట్ర ప్రజలు 30 సంవత్సరాలు వెనక్కి నెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాలను చక్కదిద్దుతుందన్నారు. సమావేశంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, మొక్కపాటి గిరిబాబు, తిరువాయిపాటి ఆంజనేయులు, పోట్ల శ్రీనివాసరావు, చల్లా అనూపకళ, తుమ్మా విజయారెడ్డి, పసుపులేటి పాపిరెడ్డి, పొన్నె కంటి రవి, నల్లపాటి చందు, కోట చంటి తదితరులు పాల్గొన్నారు.



నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

పాలువాయిగేట్‌లో నిలిచిన ఆర్వోబీ పనులు

రెంటచింతల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): 167 ఏడీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండలంలోని పాలువాయిగేట్ గ్రామంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు మూడు నెలల నుంచి నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ ద్విచక్రవాహన చోదకులు నేరుగా రహదారి వుందనే భావనతో నేరుగా వచ్చి ప్రమాదాల పాలవుతున్నారు. ఈనెల 10 తేదీన పైనుంచి కిందకు పడిపోయిన ఘటనలో గోలి గ్రామానికి చెందిన మాచవరపు నాగేశ్వరరావు మృతి చెందగా మరో వ్యక్తి చికిత్స పొందుతున్నాడు. 1.2 కి.మీ. పొడవు ఉండే ఈ ఆర్వోబీపై రైలు పట్టాలపైన మినహా రెండు వైపులా 10 గడ్డర్లు వేశారు. ఒక్కో గడ్డర్ 36 మీటర్ల పొడవు, 1 మీటర్ వెడల్పు ఉంది. రైల్వే శాఖ అనుమతిస్తే మరో 6 గడ్డర్లు వేస్తే రాకపోకలు సాఫీగా జరిగే అవకాశముంది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లి పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

పీడబ్ల్యూడీ కాలనీ స్థలాలు, నిర్మాణాలపై జాయింట్ సర్వే



పీడబ్ల్యూడీ కాలనీలో నిర్మాణాలు జరిగిన భవనాలు

మాచర్లటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణం పీడబ్ల్యూడీ కాలనీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన నివేశిత స్థలాలు, వాటిలోని నిర్మాణాలపై పురపాలక సంఘం, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సోమవారం నుంచి విచారణ చేపట్టనున్నాయి. పది టీంలు ఏర్పాటుచేసి ఒక్కో టీంకు రెండు శాఖల నుంచి ఇద్దరు చొప్పున ఒక్కో టీం పది ఇళ్లకు సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో పీడబ్ల్యూడీ కాలనీలోని స్థలాల్లో అర్హత లేకుండా పట్టాలు మంజూరుచేయడం, మరికొంతమంది మంజూరు అయిన దానికన్నా అదనపు స్థలాలను ఆక్రమించుకుని కట్టుబడులు చేయడం, విద్యుత్ వాడకం, విచ్చలవిడిగా బోర్లు తవ్వడం, అనుమతులు లేని నిర్మాణాలు చేపట్టడం, క్రయ విక్రయాలు చేపట్టడం, వాటిపై పలు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర సర్వే జరిపేందుకు సిద్ధమయ్యారు. సర్వే అనంతరం నివేదికలను బట్టి చర్యలు తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఉచిత కంటి వైద్య శిబిరం

అచ్చంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడువాయి గ్రామంలో లీగల్ అవేర్నెస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి డాక్టర్లు ఆదివారం 112మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధి డాక్టర్ ఫాదర్ అంతోని రాజు, ఆస్పత్రి డాక్టర్లు బత్తుల మల్లేష్ పాల్గొన్నారు.

పరస్పర కేసుల నమోదు

పెదకూరపాడు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పొలానికి వెళ్ళే దారి విషయంలో గొడవ జరిగి ఒకరిపై ఒకరు దాడిచేసుకున్న సంఘటన మండలంలోని చినమక్కెన గ్రామంలో జరిగినట్లు ఎస్‌ఐ గిరిబాబు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన అంబడిపూడి గోపాలకృష్ణ పై గ్రామానికి చెందిన చెరుకూరి నాగార్జున, మరో ఇరువురు కలసి కర్రతో, చేతులతో కొట్టారని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా గుంటుపల్లి తిరుపతమ్మ తనపై గ్రామానికి చెందిన అంబడిపూడి గోపాలకృష్ణ పొలం వెళ్ళే విషయమై గొడవపడి కొట్టినట్టు ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ వివరించారు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వివరించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 30.01 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 300 క్యూసెక్కులు లీకుల ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

4 పోస్టులు... 590 దరఖాస్తులు

● ఎయిడెడ్ అక్రమాలకు విద్యాశాఖ చెక్
● చల్లగుండ్ల ఎయిడెడ్ పాఠశాల పోస్టులకు నేడు పరీక్ష

గుంటూరు విద్య, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో నాలుగు పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులు వక్రమార్గంలో భర్తీకి యాజమాన్యం చేసిన ప్రయత్నాలకు విద్యాశాఖ చెక్ పెట్టింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఆహ్వానించి కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామంలోని రాజీవ్ గాంధీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పోస్టుల భర్తీకి విద్యాశాఖ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులను తమకు అనుకూలమైన వారితో భర్తీకి ప్రయత్నాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే విద్యాశాఖ అధికారులు ఈ పోస్టులు భర్తీ కోసం నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. ఆన్లైన్లో దరఖాస్తు ఆహ్వానించి కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, తెలుగు, హిందీ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు దాదాపు 590కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు విద్యాశాఖ రికార్డులు వెల్లడిస్తున్నాయి అంటే ఒక పోస్టుకు దాదాపు 120 మంది పోటీ పడుతున్నారు ఇందులో ప్రతిభావంతుల్ని, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేయడానికి ఏర్పాట్లు చేశారు. మూడు విడతల్లో దాదాపు 590 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

టీడీపీ కార్యకర్తల మృతికి ఎమ్మెల్యే ప్రవీణ్ నివాళులు

అచ్చంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చిగురుపాడు గ్రామానికి చెందిన టీడీపీ నియోజక వర్గ నాయకుడు గంధం కోటేశ్వరరావు తండ్రి అయోధ్యరామయ్య(83) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కోటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. అయోధ్యరామయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన, టీడీపీ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

టీడీపీ నాయకుడి కుమారుని మృతికి ఎమ్మెల్యే సంతాపం

క్రోసూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామంలో టీడీపీ నాయకుడు షేక్ గాలిసాహెబ్ కుమారుడు వలి ఆదివారం మృతి చెందాడు. వలి మృతివార్త తెలిసి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గుడిపాడు గ్రామానికి వెళ్ళి మృతదేహానికి నివాళులర్పించారు. తండ్రి గాలి సాహెబ్, కుటుంబసభ్యులను పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గుడిపాడు బాషా, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దూళ్ళ సాంబశివరావు, పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు కాండ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి తదితరులు వలి మృతదేహాన్ని సందర్శించి గాలి సాహెబ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.



టీడీపీ నాయకుడు అయోధ్య రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

దిక్సూచి
DIKSUCHI



ఉమ్మడి ప్రిపరేషన్ బెస్ట్

ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. పోటీ పరీక్షలు మళ్లీ మొదలయ్యాయి. ఎంపీసీ విద్యార్థులు ఏప్రిల్ మొదటి వారంలో జేఈఈ మెయిన్ రెండో సెషన్‌కి హాజరు కావాల్సి ఉంది. తరవాత మేలో ఎంసెట్ పరీక్ష రాయాలి. జేఈఈకి దాదాపుగా 13.5 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా జనవరి సెషన్‌కి దాదాపుగా 11 లక్షల మంది హాజరయ్యారు. వీటి ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. అదే సమయంలో రెండో సెషన్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది.

ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ రాసే విద్యార్థులకు సరిగ్గా రెండువారాల సమయం కూడా లేదు. అలాగే ఎంసెట్ పరీక్ష తెలంగాణలో మే 2 నుంచి 5 తేదీ వరకు జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే మే 21 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నారు. జేఈఈ, ఎంసెట్ రెండు ఎంట్రెన్స్‌లను దృష్టిలో పెట్టుకుని ఎలా సన్నద్ధం కావాలో చూద్దాం. సమయం తక్కువగా ఉంది కాబట్టి జేఈఈ విద్యార్థులు వెయిటేజీకి అనుగుణంగా చాప్టర్ల వారీగా రివిజన్‌ను ప్లాన్ చేయాలి.

- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి ముఖ్యమైన డెఫినేషన్స్, ఫార్ములాలు అండర్‌లైన్ చేసుకోవాలి. పైన పేర్కొన్న చాప్టర్ల ఆధారంగా ఈ కాన్సెప్టులను రోజూ పునశ్చరణ చేయాలి.
- రోజుకు రెండు చాప్టర్ల చొప్పున మాక్‌టెస్టులు రాయాలి. ఇవి గత జేఈఈ టెస్టుల నుంచి అయితే ఇంకా మంచిది. ప్రతీ పరీక్షలో మెరుగుదల ఉండాలంటే నెగెటివ్ మార్కులు తగ్గుతూ ఉండాలి. గెస్ వర్క్‌ను పూర్తిగా మానేయాలి.
- పరీక్షలో ప్రతీ సబ్జెక్టుకు గంట మాత్రమే సమయం కేటాయించాలి. మేథ్స్‌లో ప్రశ్నలు చాలా లెంథీగా ఉంటున్నాయి. అక్కడే సమయ పాలన చాలా అవసరం.

మేథ్స్ :	
కాలిక్యులస్	35 శాతం,
ఆల్జీబ్రా	25 శాతం,
కోఆర్డినేట్ జామెట్రీ	20 శాతం,
వెక్టార్స్ 3డి	15 శాతం
ప్రాబబిలిటీ	5శాతం
ఫిజిక్స్ :	
మెకానిక్స్	30 శాతం
ఎలక్ట్రోడైనమిక్స్	25 శాతం
ఆప్టిక్స్ అండ్ మోడ్రన్ ఫిజిక్స్	20 శాతం
థర్మోడైనమిక్స్	15 శాతం
వేవ్స్ అండ్ ఆస్లేషన్స్	10 శాతం
కెమిస్ట్రీ :	
ఫిజికల్ కెమిస్ట్రీ	35 శాతం
ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీ	30 శాతం
ఆర్గానిక్ కెమిస్ట్రీ(బయోమాలిక్యుల్స్)	35 శాతం

- టైమ్ మేనేజ్‌మెంట్ కోసం ప్రతీ ప్రశ్నకు నిర్దుష్టంగా రెండు నుంచి మూడు నిమిషాలు మాత్రమే కేటాయించుకోవాలి. కాలిక్యులేషన్స్‌లో ఎక్కువ సమయం వృథా చేయకూడదు.
- మీకు కాన్ఫిడెన్స్ ఉన్న చాప్టర్లపై ఎక్కువ శ్రద్ధ పెట్టండి. ప్రస్తుతం ఉన్న సమయం దృష్ట్యా మీరు వీక్‌గా ఉన్న చాప్టర్లను వాటి వెయిటేజీ ఆధారంగా వదిలిపెట్టడమే మంచిది.

చాప్టర్ల వారీగా ఎంసెట్ ప్రణాళిక

తెలంగాణలో ఎంసెట్‌కు ఇప్పుడు సరిగ్గా 40 రోజుల సమయం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా రెండు నెలల సమయం ఉంది. కేవలం ఎంసెట్ మాత్రమే రాయాలనుకునే విద్యార్థులు అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. మొదటి రోజు నుంచి వెయిటేజీ ఆధారంగా చదవడం చేయాలి. జేఈఈ తరవాత ఎంసెట్ రాయాలనుకునే విద్యార్థులకు టీఎస్‌లో కేవలం 30 రోజులు, ఏపీలో 50 రోజుల సమయం మాత్రమే ఉంటుంది. వీరు రాపిడ్ షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలి.

- జేఈఈ మెయిన్‌తో పోలిస్తే ఎంసెట్‌లో 25 నుంచి 30 శాతం ఎక్కువ సిలబస్ ఉంటుంది. ఈ చాప్టర్లను పూర్తిగా పునఃశ్చరణ చేయాల్సిందే.
- జేఈఈ మెయిన్, ఎంసెట్ పరీక్ష ఏదైనా కాన్సెప్టులను ఎన్‌సీఈఆర్‌టీ చాప్టర్ల నుంచే రివైజ్ చేయాలి.
- వెయిటేజీ ఆధారంగా ముఖ్యమైన చాప్టర్లను చదవండి.
- జేఈఈతో పోలిస్తే ఎంసెట్‌లో ఒక్కో ప్రశ్నకు కేటాయించిన సమయం తక్కువ. ఒక నిమిషంలో ఒక ప్రశ్నను పూరించాల్సి ఉంటుంది. కాబట్టి కాలిక్యులేషన్స్‌తో సమయం వృథా చేయవద్దు.
- ఎంసెట్‌లో నెగెటివ్ మార్కులు లేనందున, ఆప్షన్‌కు అనుగుణంగా గెస్ వర్క్ చేయవచ్చు.
- గత ముప్పై సంవత్సరాల నుంచి వచ్చిన ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా రివైజ్ చేయండి. ఎంసెట్‌లో రిపీటెడ్‌గా ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువ.
- ప్రతీ రోజు మాక్‌టెస్ట్ రాయండి. జేఈఈతో పోలిస్తే ప్రశ్నలు ఎంసెట్‌లో సులువుగా ఉంటాయి. ఎక్కువ ప్రాక్టీసు చేస్తే నిర్ణీత సమయంలోనే నిర్దుష్ట సమయంలో పేపర్‌ను పూర్తి చేయవచ్చు.
- ఒక వేళ నిమిషంలో ఆ ప్రశ్న పూర్తి కావడం లేదు అనుకుంటే ఈ ప్రశ్నను వదిలేయండి. చివర్లో సమయం మిగిలితే వీటికి ఉపయోగించవచ్చు.
- అన్నింటికన్నా ముఖ్యం ఈ కొద్దికాలం సోషల్ మీడియాతో పాటు చదువు నుంచి దృష్టి మళ్లించే ఇతర విషయాలకు దూరంగా ఉండడం అవసరం.
- చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా దృష్టిపెట్టాలి. పోషక ఆహారం, వ్యాయామం, సరైన అవసరం. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుంది.



డా.పవన్ కుమార్ కాసు
సంజీవనీ ఐఐటీ అకాడమి

పాలిసెట్ 2025



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించి పాలిసెట్ 2025 నోటిఫికేషన్లు వెలువడ్డాయి.

తెలంగాణ సెట్

తెలంగాణలోని పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి మే 13న నిర్వహించే ఎంట్రెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయింది. ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల తరహాలోనే రాష్ట్రంలోని పాలిటెక్నిక్ సీట్లన్నీ స్థానిక విద్యార్థులకు కేటాయించనున్నారు. మొత్తం సీట్లన్నీ కన్వీనర్ సీట్లు మాత్రమే. 85 శాతం సీట్లు స్థానికులకు, 15 శాతం స్థానికేతరులకు కేటాయించారు. అంటే నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికులుగా పరిగణిస్తారు. స్థానికేతర కోటా అంటే పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రంలో నివసించిన వారి పిల్లలు, తెలంగాణలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకు కేటాయిస్తారు.

ఫీజు : ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు ఫీజు రూ.250/-, ఇతరులకు రూ.500/-
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 19
(రూ.100/- ఆలస్య రుసుముతో ఏప్రిల్ 21, రూ.300/- ఆలస్య రుసుముతో ఏప్రిల్ 23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
ప్రవేశ పరీక్ష: 2025 మే 13
ఫలితాలు : 2025 జూన్
వెబ్‌సైట్ : https://polycet.sbtet.telangana.gov.in/

ఏపీ సెట్

ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఏపీ పాలిసెట్ 2025 నోటిఫికేషన్ వెలువడింది. పదో తరగతి అర్హత ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష మాత్రం ఆఫ్‌లైన్ మోడ్‌లో జరుగుతుంది. ఇది పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రశ్న పత్రం మొత్తం 120 మార్కులకు ఉంటుంది. రెండు గంటల్లో దీనికి సమాధానాలు గుర్తించాలి. లెక్కల్లో 50 ప్రశ్నలు, ఫిజిక్స్‌లో 40 ప్రశ్నలు, కెమిస్ట్రీలో 30 ప్రశ్నలు ఉంటాయి.

ఫీజు: ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400/-
ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.100/-
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 15
ప్రవేశ పరీక్ష: 2025 ఏప్రిల్ 30
ఫలితాలు : 2025 మే 10(ఉజ్జాయింపు తేదీ)
వయస్సు : ఎలాంటి వయోపరిమితి లేదు.
వెబ్‌సైట్ : https://polycetap.nic.in/

SCHOLARSHIP ALERT

Alstom India Scholarship : Phase-III

Description: Alstom India is offering this scholarship with an aim to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out.

Eligibility: Students studying in any year of ITI/Diploma, general graduation, or professional graduation in STEM courses for FY 2024-25 can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester. The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students studying in locations such as Coimbatore (Tamil Nadu), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat) at specified colleges.

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 04-05-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG8

South Asia Postgraduate Excellence Award



Description: South Asia Postgraduate Excellence Award, 2025 is offered by the University of Nottingham. It aims to assist high-achieving international students from South Asia by covering a portion of their full-time Master's tuition fees at the university.

Eligibility: Open to residents of specific South Asian countries including India. Applicants must be classed as an overseas student for fee purposes. They must hold an offer to pursue full-time Masterâ ™s program for the academic session 2025-26.

Prizes & Rewards: Up to Â£8,000 (approx. â,¹8,51,016) towards tuition fees.
Last Date to Apply : 14-05-2025
Application mode : Online applications only
Short Url: www.b4s.in/aj/SAPE1

SBIF Asha Scholarship Program

Description: The SBIF Asha Scholarship Program for Overseas Education Students, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation under its education vertical - Integrated Learning Mission (ILM). This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.


Eligibility: Open to Indian students belonging to SC and ST categories pursuing a masterâ ™s or postgraduate course (any year) at a premier university or college outside India. They should have secured at least 75% marks or above in their previous academic year, with a gross annual family income of up to INR 6,00,000.

Prizes & Rewards: Up to INR 20,00,000 or 50% of course-related expenses (whichever is less)
Last Date to Apply: 31-03-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SBIFS12

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

శ్రీలంకలో పాట చిత్రీకరణ



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కింగ్‌డమ్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో మే 30న విడుదల కానుంది. ఈ సినిమాలోని ఓ పాట చిత్రీకరణ కోసం విజయ్ దేవరకొండ శ్రీలంక వెళ్లారు. ఈ షెడ్యూల్ వారం రోజుల పాటు కొనసాగుతుంది. కాగా, విజయ్ దేవరకొండ ఎయిర్‌పోర్ట్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

జపాన్‌లో దేవర

జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన పాన్ ఇండియా చిత్రం 'దేవర' ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. జపాన్‌లో ఈనెల 28న విడుదల చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు అక్కడి ప్రేక్షకులతో కలసి 'దేవర' చూసేందుకు ఎన్టీఆర్ జపాన్ వెళ్లారు. భార్య ప్రణతితో కలసి



ఎయిర్‌పోర్టులో కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ చిత్రంలో, బాలీవుడ్ సినిమా 'వార్-2'లో నటిస్తున్నారు. 'వార్-2' ఆగస్టు 14న థియేటర్లలో విడుదలవుతోంది.



ఈ సినిమాలో నటించడం
గౌరవంగా భావిస్తున్నా
- ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వై.రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించారు. ఈనెల 28న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్, ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నా. నన్ను మీ కుటుంబ సభ్యుడిగా చూస్తున్నందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని అన్నారు. హీరో నితిన్ మాట్లాడుతూ 'ఈ సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. శ్రీలీలతో నాకు ఇది రెండో చిత్రం. మా ఇద్దరికీ హిట్ పెయిర్ అనే పేరు వస్తుంది' అని అన్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ 'నేను అనుకోకుండా చేసిన ఈ సినిమా అనుకున్న దానికంటే చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ 'డేవిడ్ వార్నర్ క్యారెక్టర్‌లో చాలా సర్‌ప్రైజ్ ఉంటుంది. మార్చి 28న మీ అందరినీ తప్పకుండా ఎంటర్‌టైన్ చేస్తాం' అని అన్నారు. నిర్మాత వై.రవి శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నవ్వులతోపాటు మంచి కథ కూడా ఉంటుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉన్నాయి. సినిమా సూపర్ డూపర్ హిట్ పక్కా' అని చెప్పారు. మరో నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ 'ఇది పూర్తిగా కుటుంబ వినోదాత్మక చిత్రం. కుటుంబ సమేతంగా చూసి ఎంజాయ్ చేయవచ్చు' అని అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీస్ నా సొంత సంస్థలాంటిది. దర్శకుడు సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు. నితిన్‌కు నెక్స్ట్ లెవెల్ విజయం ఇచ్చే చిత్రమిది. చాలా ప్రేమతో తీసిన ఈ చిత్రాన్ని ఆదరించండి' అని కోరారు. కేతిక శర్మ మాట్లాడుతూ 'అదిదా సర్‌ప్రైజు పాట నిజంగా అదిరిపోతుంది' అని అన్నారు.



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) 8వ తెలుగు సంబరాలు ఈవెంట్‌కు సిద్ధమవుతోంది. జూలై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలు అమెరికాలోని టంపాలో జరగనున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో నాట్స్ 8వ తెలుగు సంబరాలు కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సంబరాలు కాన్ఫరెన్స్ కన్వీనర్, మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ, నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని, నటీమణులు జయసుధ, ఆమని, దర్శకులు హరీశ్ శంకర్, మెహర్ రమేష్, సంగీత దర్శకుడు తమన్, గీత రచయితలు రామజోగయ్య శాస్త్రి, చంద్రబోస్, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

కీలక పాత్రలో శ్రీకాంత్




సాయి దుర్గా తేజ్, ఐశ్వర్య లక్ష్మీ జంటగా రోహిత్ కేపీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సంబరాల యేటిగట్టు'. కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమాలో శ్రీకాంత్ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. చిందరవందర జుట్టు, బాగా పెరిగిన గెడ్డంతో నల్లని కోటు ధరించిన శ్రీకాంత్ లుక్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సాయికుమార్‌కు అవార్డు



నటుడు సాయికుమార్ కుమరం భీం జాతీయ అవార్డును అందుకున్నారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో భారత్ కల్చర్ అకాడమీ, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్, ఓం సాయితేజ ఆర్ట్స్ ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. జ్ఞాపికతో పాటు 50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో భారత్ కల్చర్ అకాడమీ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి పార్థసారధి, మాజీ మంత్రి, నటుడు బాబు మోహన్, ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.
ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రం



అజయ్, ఇంద్రజ, సుమన్, జయసుధ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సీఎమ్ పెళ్లాం'. గడ్డం రమణ దర్శకత్వంలో బొల్లా రామకృష్ణ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి ప్రమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లా రామకృష్ణ మాట్లాడుతూ "రాజకీయ నేపథ్యంతో కూడిన సందేశాత్మక చిత్రమిది" అని అన్నారు. "ప్రతీ ఒక్కరినీ ఆలోచింపజేసే చిత్రమిది" అని దర్శకుడు రమణ గెడ్డం చెప్పారు. "ఈ పాట చూశాక చాలా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ సినిమాతో అందరికీ మంచి పేరు వస్తుంది" అని నటుడు అజయ్ అన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బొప్పూడిలో వైద్య శిబిరం

చిలకలూరిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాటూరి వైద్య కళాశాల, ఎన్టీఆర్ వైద్యసేవ విభాగం సంయుక్తంగా అందిస్తున్న ఉచిత వైద్యసేవలను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. చిలకలూరిపేట మండలం బొప్పూడిలో గ్రామస్థుల సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద అన్నిరకాల దీర్ఘకాలిక వ్యాధులకు కూటమి ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్యచికిత్సలు అందిస్తోందన్నారు. పలు అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి వైద్యసిబ్బంది శిబిరంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, ఇంజక్షన్లు అందించారు. దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు మాత్రం కాటూరి వైద్య కళాశాలకు వెళ్లి అక్కడ ఉచిత వైద్య సేవలు పొందే ఏర్పాట్లు చేశారు. మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, అంబటి సొంబాబు, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా పల్నాడు జిల్లా హేతువాద సంఘ మహా సభలు

నరసరావుపేట రూరల్, మార్చి 23, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా హేతువాద సంఘం ద్వితీయ మహాసభలు ఆదివారం నరసరావుపేటలో ఘనంగా నిర్వహించారు. సభకు కట్టి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హేతువాదానికి సంబంధించి పలు శాస్త్రీయ అంశాలపై వక్తలు ఉపన్యసించారు. కార్యక్రమంలో బి.సుబ్బయ్య మూర్తి, మస్తాన్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై నేటి నుంచి శిక్షణ

నాదెండ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్లలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి తెలిపారు. నాదెండ్లలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఉన్నతాధికారులు నియోజకవర్గ స్థాయి శిక్షణ కేంద్రంగా ఎంపిక చేయటంతో మూడు మండలాల అధికారులు, సిబ్బంది నాదెండ్లలో జరిగే శిక్షణ కార్యక్రమానికి హాజరవుతారని ఆమె వివరించారు. సోమవారం నాదెండ్ల మండలం, మంగళవారం, బుధవారం చిలకలూరిపేట మండలం గురువారం, శుక్రవారం యడ్లపాడు మండలానికి చెందిన అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంఆర్‌పీలు, క్లాప్ మిత్రలు, గ్రీన్ అంబాసిడర్లు హాజరవుతారని ఆమె వివరించారు.

న్యాయవాది పంగులూరికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ నివాళి

నరసరావుపేట లీగల్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మరణించిన పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పంగులూరి ఆంజనేయ చౌదరికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు నివాళి అర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పంగులూరి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతిమయాత్రలో టీడీపీ నేతలు న్యాయవాదులు చెన్నుపాటి నాగేశ్వరరావు, గుండాల సురేష్ బాబు, పి.చక్రపాణి, అబ్బూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుల గడువు పొడిగింపు

నూజెండ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈడబ్ల్యూఎస్, కార్పొరేషన్ రుణాల కోసం ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడిగించినట్టు ఎంపీడీవో పీ ఉమాదేవి ఆదివారం తెలిపారు. వయోపరిమితి 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వరకు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

చెప్పుల దండవేసిన వారిని శిక్షించాలి

● గోదా రమేష్ కుమార్

రొంపిచర్ల, మార్చి 23 (ఆంధ్రజోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూపచర్ల గాంధీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత బహుజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్ ఆదివారం పేర్కొన్నారు. మండలంలోని నలగార్లపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంతో ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్‌ను అవమానించటం దారుణమన్నారు. ఈ సంఘటన జరిగి కొద్ది రోజులైనా నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. వారిని అరెస్టు చేసి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

బొల్లాపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో 16గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రతను తగ్గించేందుకు ట్యాంకర్లతో తాగునీటిని అందించనున్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రేమిడిచర్ల గ్రామంలో ప్రజల సౌకర్యార్థం తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభించి నీటిని అందించనున్నారు.

నాయుడుపాలెంలో నేడు ఆవులయ్య తిరునాళ్ళ

బొల్లాపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెంలో ఆవులయ్య తిరునాళ్ళ సోమవారం ఘనంగా జరగనుంది. తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. తిరునాళ్ళ సందర్భంగా నాలుగు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్‌ఐ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



బావిలో వేస్తున్న వ్యర్థాలతో రంగుమారిన నీరు, ఖబరస్థాన్ వద్ద ఉన్న పురాతనమైన నిమ్మలబావి

● దశాబ్దాలపాటు దాహార్తిని తీర్చిన నిమ్మలబావి
● నేడు వ్యర్థాలతో నిండుతోంది
● బావిపై కప్పు ఏర్పాటుకు పలువురి విజ్ఞప్తి

వినుకొండ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చిన నిమ్మలబావి నేడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. వినుకొండ ఏర్పడిన తొలినాళ్లల్లో దాహార్తి తీరాలంటే నిమ్మలబావి నీరు తాగాల్సిందే. సమయంతో పని లేకుండా ప్రజలంతా ఆ బావి వద్ద బారులు తీరి బావిలోని నీటిని బిందెలతో తరలించుకుపోయి తాగునీటి అవసరాలను తీర్చుకునేవారు. నేడు పట్టణంలో సింగరచెరువు నుంచి పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటుచేయడంతో ప్రజల దాహార్తి తీర్చిన ఆ బావివైపు ఎవ్వరూ చూడటం లేదు. ఇదిలా ఉండగా ఎండ తాకిడి పెరిగినప్పటికీ ఆ బావిలోని నీరు మాత్రం నేటికీ తరగని పరిస్థితి. కానీ ఆ బావిలోకి ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలు విసిరివేస్తుండటంతో నీరు మురుగులా మారి మురికి కూపంలా తయారైంది. బావి నిరుపయోగంగా మారడంతో ఆ ప్రాంత వాసులు నిత్యం బావి వల్ల భయాందోళనకు గురవుతున్నారు.

బావి చుట్టూ గట్టు ఉన్నా ప్రమాదవశాత్తూ పిల్లలు బావిలో పడే ప్రమాదం పొంచి ఉందంటూ స్థానిక మహిళలు గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. మునిపల్ శాఖ అధికారులు స్పందించి బావిలో వ్యర్థాలు వేయకుండా, ప్రమాదాలు చోటుచేసుకుండా ఇనుప కడ్డీలతో కప్పు ఏర్పాటుచేసి బావి నుంచి రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

హర్షాతిరేకాలు



తంగిరాల - నూజెండ్ల మార్గంలో మరమ్మతులకు ముందు, మరమ్మతుల అనంతరం రహదారి



గోతులమయంగా ఉన్న ఐనవోలు - కురిచేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల అనంతరం...



రవ్వవరంలో గతంలో... నేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు

నూజెండ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీ పాలనలో రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించకపోవటంతో మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు గోతులమయంగా మారి నిత్యం ప్రమాదాలకు నెలవుగా ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించటంతో పలుచోట్ల రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. దీనిపై వాహనచోదకుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని రవ్వవరం, ఐనవోలు గ్రామాల్లో రోడ్లపై నీరు నిలిచి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు నేడు రోడ్ల నిర్మాణంతో సమస్యలు పరిష్కారమై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రధాన రోడ్ల మరమ్మతులకు రూ.1.53 కోట్లు నిధులు వెచ్చించినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవ్య వివరించారు.

బోనాల పండుగకు రూ.25వేలు వితరణ

వినుకొండ టౌన్ మార్చి 23 (ఆంధ్రజోతి): పట్టణంలోని 12వ వార్డు అంబేద్కర్ కాలనీలోని మహాలక్ష్మీ అమ్మవారి బోనాల పండుగను పురస్కరించుకుని శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులకు ఫౌండేషన్ మేనేజర్ రమేష్ చేతుల మీదుగా రూ.25వేలు చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపు కోవాలని కోరారు. కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ రమేష్, టీడీపీ నాయకులు జానీ, వార్డు కౌన్సిలర్ పులి నాగరాజు, స్థానికులు పాల్గొన్నారు.



బోనాల పండుగ నిర్వాహకులకు రూ.25 వేలు చెక్కును అందచేస్తున్న శివశక్తి మేనేజర్ రమేష్, టీడీపీ పార్టీ నాయకులు

వీరాంజనేయ నవ అవతార క్షేత్రానికి విరాళాలు



ప్రేమ్‌చంద్‌ను సత్కరిస్తున్న పూజారి రామగోపాలశర్మ

కనమర్లపూడి (శావల్యాపురం) మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కన మండలంలోని కనమర్లపూడిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వీరాంజనేయ నవఅవతార క్షేత్రం పునర్నిర్మాణానికి ప్రేమ్ టాక్స్ యూ ట్యూబర్ ప్రేమ్‌చంద్, ఆయన అభిమానులు రూ.1లక్షకు పైగా విరాళాలు సమర్పించినట్లు దేవాలయ పూజారి రామగోపాలశర్మ ఆదివారం తెలిపారు. ప్రేమ్‌చంద్ చందాదారులతో కలిసి ఆదివారం ఉదయం కనమర్లపూడికి విచ్చేసి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రేమ్‌చంద్‌ను పూజారి రామగోపాలవర్మ, గ్రామపెద్దలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గోరింట్ల హనుమంతరావు, ముక్కపాటి నాగేశ్వరరావు, కాసరగడ్డ వెంకటరత్నం, బోడెపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సందెపూడిలో సీసీ రోడ్డు పనులకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకుంటున్న క్వాలిటీ కంట్రోల్ డీఈఈ శౌరిరాజా

పల్లె పండుగ పనుల్లో నాణ్యత పరిశీలన

యడ్లపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో నిర్వహించిన సీసీ రోడ్ల పనులకు సంబంధించిన నాణ్యత పరీక్షలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 18 గ్రామ పంచాయితీల పరిధిలో రూ.2.75 కోట్లతో పనులను చేపట్టారు. వాటిలో రూ.2.50కోట్ల విలువైన 20పనులు పూర్తికాగా నరసరావుపేట పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ప్రతి సీసీ రోడ్డు కొలతలు వేయడంతోపాటు కోర్ కటింగ్ ద్వారా శాంపిల్స్‌ను సేకరించారు. అంతేగాకుండా ఎంతమందంతో నిర్మించారు, తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు మాట్లాడుతూ సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పరీక్షించడం జరుగుతుందన్నారు. సేకరించిన శాంపిల్‌ను యంత్రంపై పరీక్షించి గట్టితనం ఆధారంగా నాణ్యతను నిర్ధారించడం జరుగుతుందన్నారు. తక్కువ నాణ్యత ప్రమాణాలతో పనులు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం ఏఈలు కె.రమేష్, ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, మండల పీఆర్ ఏఈ బాలకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్షలకు 355మంది హాజరు



పరీక్షలను పరిశీలిస్తున్న ఏపీఎం వాసుబాబు

శావల్యాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వయోజన విద్య శాఖ వారి ఆధ్వర్యంలో మండలంలోని 39 ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలకు 390మందికి గాను 355మంది అభ్యర్థులు హాజరయ్యారని, 91శాతం హాజరు నమోదైనట్లు ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో 390మంది నిరక్షరాస్యులకు ఆయా గ్రామాల్లోని వీవోఏలు రెండు నెలలుగా చదవడం, రాయడం నేర్పించారన్నారు. మొత్తం 150 మార్కులకు పరీక్షలు నిర్వహించామని, 51మార్కులు సాధించినవారిని ఉత్తీర్ణులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. నిరక్షరాస్యులకు చదవడం, రాయడంలో శిక్షణనిచ్చి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పరీక్షా కేంద్రాలను శావల్యాపురం మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, ఏపీఎం వాసుబాబు, సీసీ ఖాజా పరిశీలించారు.



రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మహిళలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లగడపాటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు

నిరుపేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ

వినుకొండటౌన్, మార్చి 23, (ఆంధ్రజ్యోతి) పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని నిరుపేద ముస్లిం మహిళలకు తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సినీ నిర్మాత లగడపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ రోజుల్లో ప్రతి ముస్లిం కుటుంబాలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈసంవత్సరం కూడా నిరుపేదలను గుర్తించి సరుకులు అందచేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ జానీ, జిల్లా షోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ ఫారూక్, పట్టణ టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు షేక్ అక్బర్‌భాష, యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ 3వ బజారులో విరిగిపోయిన స్టాండ్ స్థానంలో ఏర్పాటు చేసిన కొత్తస్టాండ్, మరమ్మతులు చేపట్టిన ఎస్సీ బాలికల హాస్టల్ వద్ద ఉన్న బోరు

బోర్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వినుకొండ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చేందుకు చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలంటూ ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన చేతి పంపులకు మోక్షం ఎప్పుడు..? అనే కథనంపై ఎట్టకేలకు మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఎట్టకేలకు స్పందించారు. వినుకొండ పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం సమీపంలోని చేతి పంపుతో పాటు రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి 3వ బజారులోని చేతిపంపులకు మునిసిపల్ నిధుల నుంచి విడి భాగాలను కొనుగోలు చేసి మరమ్మతులు చేపట్టారు. ఇదిలా ఉండగా పట్టణంలోని సుమారు 400 చేతిపంపులకు మరమ్మతులు చేపడుతున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ ఆదివారం తెలిపారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు



నరసరావుపేట లీగల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే వారిపై కఠిన మైన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నామన్నారు. గతంలో బెట్టింగులకు పాల్పడిన పాత నేరస్థుల వివరాలను సేకరించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారిపై నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడినా, గుంపులు గుంపులుగా కూర్చుని సెల్‌ఫోన్ చూస్తూ బెట్టింగులు వేస్తున్న అలాంటి వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబ సభ్యులు తమ బిడ్డలు కానీ, తమ భర్తలు కానీ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషనుకు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయ న్నారు. క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని అనేకమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారి సమాచారం ఎవరిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. డయల్ 100కు గాని 112కు గాని సమాచారం అందించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.



టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న ప్రత్తిపాటి

టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కుటుంబసభ్యులకు పార్టీ సభ్యత్వ కార్డు అసలు సిసలైన గుర్తింపు అని, దాని ద్వారా లభించే గౌరవం ఎంతో విలువైనదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నియోజకవర్గంలోని మండలాల నాయకులకు, కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వ కార్డులు ఆయన ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. కుటుంబ సాధికార సారథుల నియామక ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తిచేయాలని కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సాధికార సారథుల జాబితాలో విధిగా నమోదై ఉండాలని సూచించారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు అందేలా చూడాలని, ఇంటింటికీ తిరిగి కార్డులు పంపిణీచేసి, కూటమి ప్రభుత్వ పనితీరుపై కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్ ఖాన్, జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయి బాబు, మద్దుమాల రవి పాల్గొన్నారు.





వినుకొండ డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ

పొగతో ప్రయాణికులు ఉక్కిరి బిక్కిరి



పొగ కారణంగా నిలిచిన గూడ్సు రైలు

వినుకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బ్రిడ్జి వద్ద మునిసిపాలిటీ డంపింగ్ యార్డు వద్ద వెలువడుతున్న పొగతో అటు రైల్వే అధికారులతో పాటు బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం డంపింగ్ యార్డు నుంచి వ్యాపించిన పొగ తాకిడికి రైల్వే గూడ్స్ సైతం డంపింగ్ కేంద్రం వద్ద నిలిపివేయాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొని ఉంది. పొగ తగ్గిన కొద్ది సేపటికే గూడ్స్ ముందుకు కదిలి వెళ్లింది. ఇదిలా ఉండగా ప్రతిరోజూ వేకువజామున రోడ్డుపై వ్యాప్తిస్తున్న మంచుతో పాటు నిత్యం డంపింగ్ వ్యర్థాల నుంచి వ్యాపిస్తున్న పొగ కారణంగా బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముందు ప్రయాణిస్తున్న వాహనం పొగ కారణంగా కనిపించకపోగా ఆ పొగతో ఊపిరి ఆడని పరిస్థితిని ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. యార్డులోని చెత్తను సంపద కేంద్రాలకు తరలించాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా వాటికి నిప్పు పెట్టడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. అటు రైల్వే ట్రాక్, ఇటు జాతీయ రహదారికి మధ్యన ఉన్న డంపింగ్‌యార్డును తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. చెత్తను తగలబెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్‌చేస్తున్నారు.